క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా సోమవారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రావు తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు వాహెద్ కాలనీ పరిస ప్రాంతాల్లో, ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు బడాబజార్ పరిసర ప్రాంతాల్లో, మధ్యాహ్నం 12 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు యష్రాఫ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో, మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు రాజనర్సింహా కాలనీ పరిసర ప్రాంతాల్లో, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమతా డిగ్రీ కాలేజీ పరిసరాల్లో కరెంట్ ఉండదని డీఈ తెలిపారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 63, వంకాయ 45, బెండ 45, పచ్చిమిర్చి 50, కాకర 55, బీర 45, క్యాబేజీ 23, ఫ్రెంచిబీన్స్ 55–80, క్యారెట్ 45, దొండ 28–35, చిక్కుడు 40–75, గోకర 35, బీట్‌రూట్ 26, క్యాప్సికం 70, ఆలు 24, దోస 35, సొర 15, పొట్ల 28, ఉల్లిగడ్డ 19, చామగడ్డ 40. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి: లచ్చిరెడ్డి



కార్పొరేటర్ లచ్చిరెడ్డితో నాగిరెడ్డి కాలనీ ఫేజ్‌-1 వాసులు

ఎల్‌బీనగర్: కాలనీల్లోని ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని నాగిరెడ్డి కాలనీ ఫేజ్ –1 కాలనీ వాసులు ఆదివారం కార్పొరేటర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానికులు కాలనీలోని పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సభ్యులు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భీమ్ ఆర్మీ నాయకులు

మలక్‌పేట: ప్రజా యుద్ధనౌక గద్దర్ మరణం దేశానికి తీరని లోటని భీమ్‌ఆర్మీ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం రాత్రి మూసారంబాగ్ చౌరస్తాలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. దోపిడీ, ఆర్థిక అసమానతలపై గళం వినిపించిన గొప్పకవి, గాయకుడు గద్దర్ అని అన్నారు. కార్యక్రమంలో భీమ్ ఆర్మీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రవికుమార్, మలక్‌పేట కన్వీనర్ బొడ్డు శ్రీను, ఎల్‌బీనగర్ కన్వీనర్ రాజు, కిషోర్ పాల్గొన్నారు.

గద్దర్ మృతి తీరని లోటు



గద్దర్‌తో కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి (ఫైల్)

చాదర్‌ఘాట్: ప్రముఖ ప్రజాకవి గద్దర్ మృతి ప్రజాస్వామ్యవాదులకు తీరని లోటని ఓల్డ్ మలక్‌పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మలక్‌పేటలో మాట్లాడుతూ, విప్లవ రచయితల సంఘం ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయడంలో ఆయన ముందు ఉన్నారన్నారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ కీలకపాత్ర పోషించారని, ఆయన అకాల మృతి తెలంగాణ ప్రజలకు తీరని లోటన్నారు. గద్దర్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కాలనీ సమస్యలు పట్టని కార్పొరేటర్

కాంగ్రెస్ నేత మల్లారెడ్డి

బడంగ్‌పేట్: ఏళ్ల తరబడి కాలనీలు సమస్యలతో సతమతమవుతుంటే స్థానిక కార్పొరేటర్ పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ సీనియర్ నేత నవారు మల్లారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధి అల్మాస్‌గూడలోని 24వ డివిజన్‌లోని విశాఖనగర్ ఫేస్‌-2, ఆర్‌వీఆర్ కాలనీల్లో మల్లారెడ్డి కాలనీవాసులతో కలిసి పర్యటించారు. కాలనీల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ఆరోపించారు. ఎల్‌ఆర్‌ఎస్ పేరుతో అధికారులు ఇంటి యజమానుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారే తప్ప, కనీస వసతులు మాత్రం కల్పించడం లేదని మండిపడ్డారు. కాలనీల అభివృద్ధి స్థానిక బీఆర్‌ఎస్ కార్పొరేటర్ పట్టించుకోకపోవడం లేదని విమర్శించారు.

అద్దంలాటి రోడ్లు ఛిద్రం!

- అభివృద్ధి పనుల పేరిట అడ్డగోలు తవ్వకాలు
- రాకపోకలకు ప్రజల అవస్థలు



కర్మన్‌ఘాట్ పాత బస్తీలో భూగర్భ డ్రైనేజీ పనుల కోసం తవ్వకాలు

చంపాపేట: కోట్లు, లక్ష రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మిస్తున్న బీటీ, సీసీ రోడ్లను అభివృద్ధి పనుల పేరిట కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. పైప్‌లైన్లు వేశాక రోడ్లు నిర్మించాల్సి ఉండగా, అధికారుల్లో సమన్వయ లోపంతో ముందే రోడ్లు వేయడం.. కొద్ది రోజులకే అభివృద్ధి పనులంటూ అద్దంలా ఉన్న రోడ్లను తవ్వి గుల్ల చేయడం పరిపాటిగా మారింది. ఫలితంగా ప్రజలు రాకపోకలు నానా అవస్థలు పడుతున్నారు. చంపాపేట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లోని రోడ్ల పరిస్థితే ఇందుకు నిదర్శనం.

- చంపాపేట డివిజన్‌లోని కర్మన్‌ఘాట్, నేతాజీనగర్, యాదగిరినగర్, దుర్గాభవానీనగర్, మారుతీనగర్ వంటి పలు కాలనీలలో డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ నిర్మాణం వంటి పనుల పేరిట కాలనీ ప్రధాన, అంతర్గత రహదారులను తవ్వేస్తున్నారు.
- కొన్నిచోట్ల పనులు పూర్తయ్యాక అడ్డదిడ్డంగా పూడ్చేసి రోడ్డుపక్కనే మట్టి కుప్పలు, కంకర రాళ్లను వదిలేస్తున్నారు.
- నెలలు గడుస్తున్నా ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టడంలేదు. ఆయా రహదారులలో భారీవాహనాలు ప్రయాణించేటప్పుడు దుమ్ము, ధూళితో ఎగిసిపడుతోందని స్థానికులు వాపోతున్నారు.
- వర్షం వచ్చినప్పుడు ఆ గుంతల్లో నీరు నిలిచి పాదచారులు, ద్విచక్ర వాహనదారులు రాకపోలకు ఇబ్బందులు పడుతున్నారు.
- రోడ్డుపై ఏర్పడ్డ గుంతల కారణంగా తమ షాపులకు వచ్చేవారు లేక వ్యాపారాలు స్తంభిస్తున్నాయని రోడ్డ పక్కన ఉన్న షాపుల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- తవ్వకాలు జరుపుతున్న కాంట్రాక్టర్లను రోడ్ల మరమ్మతుపై నిలదీస్తే జీహెచ్‌ఎంసీకి డబ్బులు డిపాజిట్ చేసి అనుమతి తీసుకున్నామని, మాకు వీలున్నప్పుడే గుంతలు పూడుస్తామని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- ఇప్పటికైనా అధికారులు డివిజన్‌లోని అన్ని కాలనీల్లో పర్యటించి అభివృద్ధి పేరిట జరుగుతున్న తవ్వకాలను పర్యవేక్షించాలని, పనులు పూర్తయిన వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపట్టేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్లను ఛిద్రం చేశారు



కర్మన్‌ఘాట్ చౌరస్తా నుంచి గాయత్రినగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిని భూగర్భ డ్రైనేజీ విస్తరణ పేరిట 15 రోజులుగా త్వకాలు జరుపుతున్నారు. అద్దంలా ఉన్న రోడ్డును గుల్ల చేయడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

– రాము, చిలుకబస్తీ

మరమ్మతులపై నిర్లక్ష్యం



యాదగిరినగర్, ఈస్ట్ మారుతీనగర్, నేతాజీనగర్ కాలనీలో అభివృద్ధి పనుల పేరిట రహదారిని తవ్వి వదిలేశారు. మరమ్మతులు మాత్రం చేపట్టడంలేదు. అసలే వర్షాకాలం... నడకే నరకంగా మారింది. వెంటనే రహదారికి మరమ్మతులు చేపట్టాలి.

– మంత్రి జగన్, చంపాపేట

గో ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



గో మహా పాదయాత్రలో పాల్గొన్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి తదితరులు

సైదాబాద్: గోవు ఆధారిత వ్యవసాయాన్ని, వాటి ఉత్పత్తులను అందరూ ప్రోత్సహిచాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి కోరారు. గోవును రక్షించాలని, గోవును జాతీయప్రాణిగా ప్రకటించాలని కోరుతూ అఖిల భారత గో సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి నగరం నుంచి తిరుపతి మీదుగా అరుణాచలానికి గో మహాపాదయాత్రను ఆదివారం ప్రారంభించారు. సికింద్రబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయం నుంచి ప్రారంభమైన ఈ యాత్రలో సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు. అంతకు ముందు ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన సైదాబాద్‌లో మాట్లాడుతూ, గోవును కాపాడాలనే సదుద్దేశంతో గో సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 100 మంది గో సేవకులు 25 రోజులు 789 కిలో మీటర్ల మేర పాదయాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



ఎల్‌బీనగర్‌లో పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ చేనేత విభాగం నేతలు

మన్సూరాబాద్: ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న చేనేత కార్మికులకు హెల్త్ కార్డులు, జియో ట్యాగ్ మగ్గంపై పనిచేసే చేనేత కార్మికునికి ప్రతి నెలా రూ.2 వేలు, అనుబంధంగా ఉన్న కార్మికులకు వెయ్యి రూపాయలు బ్యాంక్‌లో జమ చేస్తున్నట్లు మంత్రి కేటీఆర్ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించడంపై బీఆర్‌ఎస్ చేనేత విభాగం నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు ఆదివారం ఎల్‌బీనగర్‌లో సీఎం కేసీఆర్, కేటీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ చేనేత విభాగం నేతలు బొల్ల శివశంకర్, చెరుకు స్వామి, ఎర్ర నర్సింహ, పుట్టపర్తిని రమేష్, చెరుపల్లి బాలరాజు, ప్రకాష్ పాల్గొన్నారు.

రూ.36.40 కోట్లతో మలక్‌పేట రైల్వేస్టేషన్ ఆధునీకరణ



మలక్‌పేట రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

సైదాబాద్: ప్రయాణికుల సౌకర్యం కోసం కేంద్ర ప్రభుత్వం దేశంలోని పలు రైల్వేస్టేషన్లను ఆధునీకరిస్తున్నదని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా పలు రైల్వేస్టేషన్ల ఆధునీకరణ పనులను ప్రారంభించారు. అందులో భాగంగా మలక్‌పేట రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనుల ప్రారంభోత్సవంలో సురేందర్‌రెడ్డి, రైల్వే అధికారులు, బీజేపీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా అమృత్ భారత్ స్టేషన్‌గా మలక్‌పేట రైల్వేస్టేషన్‌ను రూ.36.40 కోట్లతో ఆధునీకరిస్తున్నారన్నారు. అయితే ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి మలక్‌పేట ఎమ్మెల్యే హాజరు కాకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను అడ్డుకునేలా రాజకీయ పార్టీలు వ్యవహరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్, కొత్తకాపు రవీందర్‌రెడ్డి, కార్పొరేటర్లు జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



- తరలింపునకు నోచుకోని చెత్త
- కంపుకొడుతున్న కాలనీల రోడ్లు

దిల్‌సుఖ్‌నగర్: కాలనీల్లో చెత్త పేరుకుపోయింది... రోడ్ల పక్కగా ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. కొన్ని రోజులుగా కాలనీల్లోని చెత్తను పారిశుద్ధ్య కార్మికులు ఎత్తకపోవడంతో రోడ్లపై గుట్టలుగా పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఆర్‌కేపురం డివిజన్‌లోని కాలనీల్లో చెత్తపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించామంటున్న అధికారులకు కాలనీలు, బస్తీల్లో పేరుకుపోయిన చెత్త కనిపించకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు అంటున్నారు. డివిజన్‌లోని ఎన్‌టీఆర్ నగర్, హరిపురి కాలనీ, జనప్రియ కాలనీ, కృష్ణానగర్, సిరినగర్ కాలనీ, సౌభాగ్యపురం కాలనీ తదిత కాలనీల్లో ఎక్కడ చూసినా చెత్తే దర్శనమిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగించాలని ఆయా కాలనీల వారు డిమాండ్ చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- మేయర్ చిగురింత పారిజాత

బడంగ్‌పేట్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత అన్నారు. ఆదివారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని 20వ డివిజన్‌లోని భీమిడి కాలనీ, షిరిడి ఎన్‌క్లేవ్ కాలనీల్లో మేయర్ పారిజాత స్థానిక కార్పొరేటర్ పి.సుదర్శన్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం కాలనీల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెట్లే మానవాళికి వాయువును అందిస్తున్నాయని, వాటిని మనం పెంచి పెద్ద చేసి పర్యావరణానికి పాటుపడుదామని చెప్పారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, మహిళలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పహాడీషరీఫ్: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని బీఆర్‌ఎస్ యువనేత పల్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని వాదే ముస్తఫా క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజ రై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్తీకరెడ్డి మాట్లాడుతూ.. యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. జాతీయ, అంత ర్జాతీయ స్థాయిలో రాణించి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. క్రీడల కోటాలో కూడా ప్రభుత్వ ఉద్యోగాలు సైతం లభిస్తాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎక్బాల్ ఖలీఫా, యూసుఫ్‌పటేల్, షేక్ అఫ్జల్, హమీద్, నిరంజన్, యంజాల అర్జున్, రవూఫ్, సయ్యద్ హుస్సేన్ పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడం హర్షనీయం

హుడాకాంప్లెక్స్: 'రెడీ టూ సర్వ్ ఫౌండేషన్' వారు అన్నదానం చేస్తూ ఎంతో మంది నిరుపేదల ఆకలిని తీర్చడం హర్షనీయమని డా.విజయభాస్కర్, సినీ నటులు, నిర్మాత శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. సరూర్‌నగర్‌కు చెందిన పెద్ది శంకర్ రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉస్మానియా ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్ని దానాల్లో కెల్లా అన్నదానం ఎంతో గొప్పదన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. ఫౌండర్ శంకర్, శివచైత్య, బీటీ నాయుడు, లక్ష్మణ్, నవీన్, ప్రవీణ్, రాజు, రమేష్, నితిన్, రాము, ప్రశాంత్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి: ఎమ్మెల్యే



కాలనీల వాసులతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజీగూడ: అభివృద్ధి పనుల నిర్వహణకు కాలనీల ప్రజలు సహాయ సహకారాలు అందించాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని గ్రీన్‌వుడ్ కాలనీ, కమర్షియల్ టాక్స్ కాలనీ, వాసవీ ఎన్‌క్లేవ్, బ్లడ్‌బ్యాంక్ కాలనీ వాసులు ఆదివారం ఎమ్మెల్యేను తన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు తమ కాలనీల్లో చిన్నపాటి వర్షానికే వరద నీరు చేరుతోందని తెలిపారు.దీంతో వెంటనే ఎమ్మెల్యే వాటర్ వర్క్స్ మేనేజర్ వినోద్‌ను తన కార్యాలయానికి పిలిపించి సమస్యను పరిష్కరించాలని కోరారు. సుమారు 1300 మీటర్ల ట్రంక్ లైన్ ఏర్పాటు చేస్తే ఆయా కాలనీల్లో వరద నీటి సమస్య పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యేకు వాటర్ వర్క్స్ మేనేజర్ తెలిపారు. వెంటనే ట్రంక్ లైన్ పనులు చేపట్టాలని, అవసరమైన నిధులు త్వరలోనే మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం డిమాండ్



ఎరుకల గర్జన మహాసభలో అభివాదం చేస్తున్న ఎరుకల సంఘం నేతలు

మన్సూరాబాద్: ఎరుకల కులస్తులకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలతో పాటు నామినేటెడ్ పదవుల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి కుమార్, ఉపాధ్యక్షుడు బుడ్డ సత్యనారాయణలు డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లోని ఎస్కే గార్డెన్స్‌లో ఆదివారం ఎరుకల గర్జన మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, బీఎన్‌రెడ్డినగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్నగౌడ్ హాజరయ్యారు. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరానికి వలస వచ్చిన ఇళ్లు లేని ఎరుకలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు లేదా ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ప్రతి ఏరుకల కుటుంబానికి లక్ష రూపాయల గిరిజన బంధు ప్రకటించాలని, పందులు పెంచుకునే ఎరుకల కుటుంబాలకు పెండింగ్ నిధులు విడుదల చేయాలని, ఏకలవ్య ఆత్మగౌరవ భవనానికి స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మహాసభలో తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, శంకర్, ఉప్పలయ్య, రఘు, రమేష్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌బీనగర్‌లో జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ముద్దగౌని లక్ష్మీప్రసన్న



ఎల్‌బీనగర్‌లో.. వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు రాయబండి పాండురంగాచారి

నిస్వార్థ పోరాటయోధుడు ప్రొ.జయశంకర్



ఫతుల్లాగూడలో నివాళులర్పిస్తున్న రామ్మోహన్‌గౌడ్

మన్సూరాబాద్: తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని ఎల్‌బీనగర్‌లోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలలు వేసి నివాళులర్పించారు. నాగోలు డివిజన్ ఫతుల్లాగూడలో మాజీ వార్డు సభ్యుడు పెద్దులు ఆధ్వర్యంలో, చంపాపేటలో చౌరస్తాలో తెలంగాణ ఉద్యమకారుడు బైగళ్ల రాము ఆధ్వర్యంలో, చైతన్యపురి చౌరస్తాలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమ నాయకులు, వివిధ పార్టీ నాయకులు మాట్లాడుతూ, ప్రత్యేక రాష్ట్ర సాధనకు ఆయన ఎనలేని కృషి చేశారని కొనియాడారు. తెలంగాణ కోసం తన జీతం, జీవితాన్ని అంకితం చేసిన నిస్వార్థ పోరాటయోధుడని కొనియాడారు. ఆయన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు.



చైతన్యపురి చౌరస్తాలో... దాసోజు శ్రవణ్, విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు



చంపాపేట చౌరస్తాలో...లక్ష్మీప్రసన్న, తెలంగాణ ఉద్యమకారులు



ఫతుల్లాగూడలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ చింతల అరుణ

ఘనంగా శ్రావణ బోనాలు



వేడుకల్లో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి ఆఫీసర్స్ కాలనీలోని మడేలేశ్వర, ఈదమ్మ తల్లి ఆలయంలో ఆదివారం శ్రావణ మాస బోనాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో ఆలయ కమిటీ ప్రతినిధులు పెద్దవూర బ్రహ్మయ్య, పున్నం రాములు, మడేలు, సంజీవ, దయానంద్, నిరంజన్, బుచ్చయ్య, ఆంజనేయులు, బాబురావు, గిరి పాల్గొన్నారు.

ప్రసన్న మహంకాళి ఆలయంలో...

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధిలోని ప్రసన్న మహంకాళి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ వజీర్ ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం బోనాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ వెంకటేశ్ మాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు. నాయకులు లింగాల రాహుల్‌గౌడ్, పట్నాల విశ్వేశర్‌రెడ్డి, శ్రీనివాస్, రమణారెడ్డి, జాఫర్, వీరన్న పాల్గొన్నారు.

హస్తినాపురం ఈస్ట్‌లో...

వనస్థలిపురం: హస్తినాపురం ఈస్ట్‌లోని పోచమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. హస్తినాపురం ఈస్ట్, పరిసర కాలనీల మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ చైర్మన్ పి.భూపతిరెడ్డి, కాలనీ అధ్యక్షుడు కె.భూపతి రెడ్డి, నాయకులు కొలను రూపేష్‌రెడ్డి, కృష్ణాగౌడ్, రాజేష్‌బాబు, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.



హస్తినాపురం ఈస్ట్‌లో బోనాలు తీసుకెళ్తున్న భక్తులు



రామ్మోహన్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ప్రసన్న మహంకాళి ఆలయ నిర్వాహకులు